# ఇదో అలవాటు

*-నూతలపాటి వెంకటరత్నం*

'స్టాఫ్‌రూమ్'లో కాంపోజిషన్స్ దిద్దుకుంటున్న నాకు "మోహన్‌గారు కావాలండి" అన్న మాట వినిపించి చేసే పని పక్కనపెట్టి బయటికి వచ్చాను.

ఎదురుగా నా ఈడున్న వ్యక్తి ఆతృతగా చూస్తున్నాడు. సన్నగా కోల మొహంతో పీక్కుపోయిన దవడలతో లోతుగా ఉన్న కళ్ళతో సగం మాసిన ప్యాంటు షర్టుతో అందవికారంగా ఉన్నాడు.

"ఎవరు కావాలండీ?" అన్నాను.

"మోహన్‌గారు కావాలండీ?" అన్నాడు.

"ఆ...నేనే! చెప్పండి" అన్నాను.

"నిన్ను గుర్తుపట్టలేకపోయాను. ఆకారం బాగా మారింది. అప్పటికి ఇప్పటికి పోలిక లేకుండా ఉంది. సారీ!" అన్నాడు గొణుగుతున్నట్టుగా.

ఇంతకీ తనెవరో చెప్పకుండా ఈ సస్పెన్స్ ఏమిటి? అనుకుంటూ "మీరెవరో గుర్తు పట్టలేక పోతున్నాను" అన్నాను కొంచెం గిల్టీగా.

"నేను సుబ్బారావుని. నీ క్లాస్‌మేట్‌ని. మనం పదవ తరగతి దాకా కలిసి చదువుకున్నాం. గుర్తొచ్చానా!" అన్నాడు ఉత్కంఠగా.

ఎప్పుడు పదవ తరగతి. ముప్ఫై యేళ్ళ పైమాట. అప్పటికి ఇప్పటికి ఎన్ని మార్పులు వచ్చాయి. అట్లాగే ఆకారంలోనూ. అప్పుడు గుర్తొచ్చింది. పొరుగూరు నుండి కొంతమంది మా హైస్కూల్‌కి పిల్లలు వచ్చేవాళ్ళు. వాళ్ళలో వీడూ ఉన్నాడు. కాకపోతే అప్పుడు చిన్నతనాన కొంచెం బాగుండే వాడు. ఇప్పుడు గుర్తు పట్టటానికి వీలు లేకుండా ఉన్నాడు.

"ఆ... నువ్వా! గుర్తు పట్టలేకపోయాను ఇప్పటిదాకా...రా! కూర్చో" అంటూ కూర్చోటానికి బల్ల ఒకటి చూపించి నేనూ ఎదురుగా కూర్చున్నాను.

కూర్చున్న సుబ్బారావుని చూస్తూ క్షణం ఆలోచించాను. వీడికి నాకు బాగా మంచి స్నేహమేమీ లేదు. అందరిలాగే క్లాస్‌మేట్. అంతే! ఇంతదూరం దాదాపు రెండు వందల కిలోమీటర్లు నన్ను వెదుక్కుంటూ ఎందుకు వచ్చినట్టు! సమాధానం కోసమన్నట్టు సంభాషణ ప్రారంభించాను.

'ఏం పని మీద వచ్చావురా!' అడిగాను.

'ఇటు వెళ్తున్న నాకు, నువ్వు ఇక్కడ ఉద్యోగం చేస్తున్నావని తెలిసింది. చూసి పోదామనిపించింది" అన్నాడు సుబ్బారావు.

"మీ స్వంత ఊర్లోనే ఉంటున్నావా? పిల్లలేం చేస్తున్నారు?" అడిగాను మళ్ళీ .

"ఇద్దరు పిల్లలు. అమ్మాయి పెద్దది. పది చదివి మానేసింది. అబ్బాయి చిన్నవాడు స్కూలుకెళుతున్నాడు. ఉండడం కూడా మా ఊళ్ళోనే" అన్నాడు సుబ్బారావు.

"మీ కబుర్లేమిటి?" అడిగాడు నన్ను.

"నా పరిస్థితి ఇంచుమించు అదే! కాకపోతే పిల్లలు కాలేజి చదువులకి వచ్చారు. ఖర్చు కాస్త పెరిగింది" అన్నాను.

"ఎక్కడ చదివిస్తున్నావ్?" అడిగాడు.

"గుంటూరు" చెప్పాను.

"హాస్టలా!" అడిగాడు.

అవునని తలూపాను.

ఇంతలో మా స్టాఫ్ ఒకరిద్దరు వచ్చారు. వాళ్ళకి తనని పరిచయం చేశాను. పరిచయాలయిన తర్వాత వాళ్ళు స్టాఫ్ రూమ్‌లోకి వెళ్ళారు. ఇంతలో మధ్యాహ్నం 'లాంగ్‌బెల్' కొట్టటంతో పిల్లలు బిలబిలమంటూ ఇళ్ళకి

## బట్టల్లేనితనం

బట్టల్లేనితనం
అనాగరికమయితే
బట్టలిప్పుడీసి
తిరిగేతనాన్ని ఏమందాం?!

*- దయాకరరావు*

వెళ్ళటం మొదలు పెట్టారు.

అయిదు నిమిషాలయిన తర్వాత "భోజన సమయమైంది. ఇక నేను కూడా వెళ్ళాలి'' అన్నాను.

నేనూ వెళ్తాను. ఈలోగా ఒక్కమాట విను. "అమ్మాయి పెళ్ళీడు కొచ్చింది. పెళ్ళి చేయటానికి చేతిలో డబ్బు లేదు. అందుకని మీలాంటి వాళ్ళని తలాకొంచెం సాయం చెయ్యమని అడుగుతున్నాను. అందుకే వచ్చాను". అన్నాడు అసలు సంగతి బయట పెడుతూ.

వాళ్ళ కుటుంబం అంతహీనమైంది కాదు. ఆ రోజుల్లో వాళ్ళ నాన్న కిరాణా వ్యాపారం చేసేవాడు. ఆశ్చర్యంతో అదే అడిగాను.

"మీకు వ్యాపారం అదీ ఉండాలి కదా?"

"ఉంది. మా నాన్న చనిపోయాడు. ఆయన పెట్టిన అప్పులు వసూలు కాలేదు. నేను మళ్ళా వ్యాపారం చేశాను. అదీ ఎక్కిరాలేదు. మొత్తం మీద అప్పులు మిగిలినయ్. భుక్తి కూడా సరిగా గడవటం లేదు. ఈ స్థితిలో అమ్మాయి పెళ్ళి చెయ్యాల్సి వచ్చింది'' అన్నాడు కొంచెం ఇబ్బందిపడ్తూ.

''సరే! ఇవ్వటికివ్వుడు నా దగ్గర ఏముంటాయిరా! నేను పొరుగూరి నుండి వస్తున్నాను" అన్నాను సాలోచనగా.

"తలో నాలుగయిదు వందలు ఇస్తే ఏవన్నా పదివేలు చేసి పిల్ల పెళ్ళి చేసుకుంటాను" అన్నాడు సుబ్బారావు.

నా హృదయం కలుక్కుమంది. ఈ దేశపు దారిద్ర్యం క్షణం కళ్ళముందు తారసిల్లింది.

ఆ క్షణంలో ఎన్నోసంగతులు లీలగా జ్ఞాపకం వచ్చినయ్. బలవంతంగా వాటినన్నింటిని పక్కనపెట్టి తోటి 'కొలీగ్స్' నడిగి నాలుగు వందలు తీసుకొని వాడికిచ్చి పంపించాను. వాడు ఆనందంగా వెళ్ళినట్టు అనిపించింది నాకు. ఈ రోజు ఒక మంచి పని చేశానని తృప్తి పడి భోజనం చెయ్యటానికి స్టాఫ్ రూంలోకి వెళ్ళాను.

❖❖❖

ఇది జరిగిన చాన్నాళ్ళకి విజయవాడలో ఒక పెళ్ళికి వెళ్ళాను.

ఆ పెళ్ళికి బాలకృష్ణ అని చిన్ననాటి స్నేహితుడొకడు వచ్చాడు. ఇద్దరం పలకరించుకున్నాం. తర్వాత పిల్లలు వాళ్ళ చదువులు, ఉద్యోగాలు, సమస్యలు స్నేహితులెవరెవరు ఏయే ఉద్యోగాల్లో ఉన్నదీ ఇలా చాలా రకాలుగా పిచ్చాపాటీ నడిచింది. ఆ సందర్భంగా మళ్ళీ సుబ్బారావు ప్రసక్తి వచ్చింది.

"సుబ్బారావు బాగా చితికిపోయాడురా మొన్న నాదగ్గరికి వచ్చాడు. పిల్ల పెళ్ళి చెయ్యాలి, సాయం చెయ్యమని" అన్నాను నేను.

"నీ దగ్గరకూ వచ్చాడు! వాడు అడగనిదెవర్ని! పేకాటలో ఆస్తి అంతా తగలేశాడు. ఆ భార్య వాడికి తగ్గదే. ఇప్పుడు ఎవడు డబ్బులిస్తాడా అని తిరుగుతున్నాడు. వాడిదికాదు తప్పు. ఇచ్చేమనదే తప్పు" అన్నాడు బాలకృష్ణ.

నేను అవాక్కయ్యాను వాడట్లా అనేసరికి. అపాత్రదానమైనందుకు కించిత్తు బాధపడుతూ ఇలాంటి అనుభవాలు భవిష్యత్తులో నిజంగా అవసరం ఉన్నవాడెవడైనా అడిగినా ఆలోచించేలా చేస్తుంది కదా! అనుకుంటూ.

"ఔనురా! మనలాంటి ఉద్యోగస్తుల్ని, వ్యాపారుస్తుల్ని తెలిసినవరకు లిస్టు వ్రాసుకుని ఎంతదూరమైనా వెళ్తున్నాడు. నాలుగైదు వందలు తీసుకుంటాడు. అవి ఖర్చు పెట్టుకుంటాడు. పిల్ల పెళ్ళిలేదు. గిళ్ళీ లేదు. ఈ డబ్బు అయిపోగానే మళ్ళీ యథావిధిగా ఇంకోడ్ని వేటాడతాడు డబ్బులికి. వాడికిదో అలవాటయ్యింది" అన్నాడు బాలకృష్ణ.

"అయితే నాతర్వాత ఇంకెంతమంది ఉన్నారో లిస్టులో" అన్నాను.

"ఏమో! ఎవరికి తెలుసు. వాణ్ణిచూస్తే పచ్చని చెట్టు మీద వాలే చిలుకలు జ్ఞాపకం వస్తయ్" అన్నాడు బాలకృష్ణ.

"ఇక చాల్లే!" అన్నట్టు సంభాషణ గతిని మార్చి, పెళ్ళికూతురు తరపు వాళ్ళ గురించి, పెళ్ళి కొడుకు తరపు వాళ్ళ గురించి, కట్నాలు, కానుకలు గురించి, ఇలా ఏదో ఒక అంశం మీద మాట్లాడుతూ టైం గడిపానే కాని సుబ్బారావుని మర్చిపోలేక పోయాను మనసులో.

జీవితంలో క్రమశిక్షణ లేకపోతే ఇలాంటి సుబ్బారావులే తయారవుతారు. ఊరికే వస్తే తేరగా తిందామనుకుంటూ సోమరిపోతులవుతుంటారు. ●